పండిట్ల ప్రమోషన్లపై కాంగ్రెస్ సొంత డబ్బా!

ఉపాధ్యాయుల ఆశలు నెరవేర్చింది కేసీఆర్

- క్రెడిట్ కోసం కాంగ్రెస్ సర్కారు తహతహ
- గతంలో కోర్టు కేసులతో నిలిచిన ప్రక్రియ
- నేడు కేసులు కొలిక్కిరావడంతో షురూ
- ఆ ప్రక్రియనే కొనసాగించిన రేవంత్ ప్రభుత్వం

హైదరాబాద్, జూన్ 22 (నమస్తే తెలంగాణ): ఏనుగెళ్లింది.. తోక చిక్కింది.. అన్న చందాన భాషా పండితులు, పీఈటీల అప్‌గ్రేడేషన్‌పై గల కోర్టు కేసు ఇటీవలే కొలిక్కివచ్చింది. చేసిందంతా కేసీఆర్ ప్రభుత్వం అయితే, ఉపాధ్యాయుల జీవితాల్లో తామే వెలుగులు నింపామంటూ కాంగ్రెస్ సర్కారు సొంత డబ్బా కొట్టుకుంటున్నది. ఈ క్రెడిట్‌ను కొట్టేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పాకులాడుతున్నది. ఉమ్మడి రాష్ట్రంలో చెప్పతరం కాని బాధలు అనుభవించిన గ్రేడ్-2 భాషాపండితుల వెతలు తీర్చేందుకు గత కేసీఆర సర్కారు శతవిధాలా ప్రయత్నించింది. ఆఖరుకు అప్‌గ్రేడేషన్ ఆశను నెరవేర్చింది. ఈ దశలో ఎన్నో అడ్డంకులు, కోర్టు కేసులు వచ్చిపడ్డాయి. అయినా ఇచ్చిన మాటకు కట్టుబడి భాషా పండితులు, పీఈటీల్లో నవోదయం నింపేందుకు చేయని ప్రయత్నమంటూ లేదు. ఈ దశలోనే ఎన్నికలు వచ్చి కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత కోర్టు కేసు ఇటీవలే కొలిక్కివచ్చింది. మల్టీజోన్-1లో పదోన్నతులు దక్కాయి. మల్టీజోన్-2లో నేడో, రేపో దక్కనున్నాయి. రాష్ట్రంలో శనివారం వరకు 10,851 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు దక్కాయి. వీరిలో 8,630 మంది భాషా పండితులు, 1,849 మంది పీఈటీలు ఉన్నారు. మల్టీజోన్-2లో మరో 8 వేల మందికి రెండు మూడు రోజుల్లో పదోన్నతులు దక్కనున్నాయి. వీరిలో భాషాపండితులు, పీఈటీలు, సెకండరీ గ్రేడ్ టీచర్లు ఉన్నారు.

కేసీఆర్‌దే ఆ క్రెడిట్

రాష్ట్రంలో భాషాపండితులు, పీఈటీల అప్‌గ్రేడేషన్ అనే హామీని నెరవేర్చిన ఘనత ఒక్క కేసీఆర్‌కే దక్కుతుంది. ఇదే కాదు 2015 నుంచి ఉపాధ్యాయులకు పదోన్నతులు లేవు. 2018 నుంచి బదిలీలు చేపట్టలేదు. వీటిని 2023లో కేసీఆర్ సర్కారే ప్రారంభించింది. టీచర్ల తంటాలు తీర్చింది, పదోన్నతులు కల్పించేందుకు చొరవ తీసుకున్నది కేసీఆర్ సర్కారు అయితే ఈ క్రెడిట్‌ను నేటి రేవంత్‌రెడ్డి సర్కారు కొట్టేసేందుకు ప్రయత్నిస్తున్నది. చరిత్రలో లేనట్టుగా తామే పదోన్నతులు ఇచ్చినట్టు ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం శుక్రవారం ఓ పత్రికా ప్రకటనను విడుదల చేయడం విడ్డూరం.

- 2017లో ప్రపంచ తెలుగు మహాసభల్లో అప్పటి సీఎం కేసీఆర్ గ్రేడ్-2 భాషా పండితులు, పీఈటీలను అప్‌గ్రేడ్ చేస్తామని ప్రకటించారు. ఇచ్చిన హామీ మేరకు 2,487 భాషా పండితులను 1,047 పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేశారు.
- సర్వీసు రూల్స్‌ను మార్చకపోవడంతో అభ్యంతరం వ్యక్తంచేస్తూ కొందరు సెకండరీ గ్రేడ్ టీచర్లు కోర్టుకెళ్లడంతో అప్‌గ్రేడేషన్ నిలిచింది. ఈ నేపథ్యంలో సర్వీస్‌రూల్స్‌ను గత కేసీఆర్ సర్కారు మార్చింది. ఈ మేరకు జీవో-2, జీవో-3ను జారీచేసింది.
- ఆ తర్వాత 2019లో 8,156 భాషా పండితులు, 1,937 పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేశారు. ఈ మేరకు జీవో 11, 12ను జారీ చేసింది.
- ఈ పోస్టులను కేవలం పండితులకే కాదు.. తమకు అవకాశం కల్పించాలని సెకండరీ గ్రేడ్ టీచర్లు మళ్లీ కోర్టుకెళ్లడంతో నిలిచిపోయింది. 2021 ఏప్రిల్ 6న స్టే విధించింది.
- ఆ తర్వాత హైకోర్టు సింగిల్ బెంచ్, డివిజన్ బెంచ్ తీర్పులు, ఆఖరుకు సుప్రీంకోర్టు వరకు వెళ్లడం ఇటీవలే సుప్రీంకోర్టు ఆయా పిటిషన్లను కొట్టివేయడంతో అన్ని అడ్డంకులు తొలగి, తాజాగా భాషా పండితులు, పీఈటీలకు పదోన్నతులు లభించాయి.

2023లోనే పదోన్నతులు, బదిలీల షెడ్యూల్

వివిధ కారణాలతో 2015 నుంచి టీచర్లకు పదోన్నతులు లేవు. 2018 నుంచి బదిలీలు చేపట్టలేదు. ఎట్టకేలకు 2023 జనవరిలో టీచర్ల బదిలీలు, పదోన్నతులకు కేసీఆర్ ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. సవివరమైన మార్గదర్శకాలతో కూడిన జీవో నంబర్-5ను 25-1-2023న జారీ చేసింది. ఆ తర్వాత కొన్ని సవరణలు చేస్తూ తేదీ 7-2-2023న జీవో నంబర్-9ని జారీచేసింది. బదిలీల షెడ్యూల్‌ను సైతం విడుదల చేసి, ఉపాధ్యాయుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించింది. ఈ షెడ్యూల్ ప్రకారం రాష్ట్రంలోని 79,000 మందికి పైగా టీచర్లు బదిలీలు కోరుతూ దరఖాస్తులు సమర్పించారు. సవ్యంగా బదిలీలు జరగాల్సిన తరుణంలో సీనియారిటీ జాబితాల రూపకల్పనపై అభ్యంతరం వ్యక్తంచేస్తూ కొందరు, టెట్ అర్హత గల వారికే ఇవ్వాలని పలువురు టీచర్లు కోర్టును ఆశ్రయించడంతో ప్రక్రియ నిలిచింది. ఆ తర్వాత జీవో-5, జీవో-9 చట్టబద్ధతను ప్రశ్నిస్తూ కొందరు హైకోర్టులో కేసు వేశారు. ఈ రెండు జీవోలకు చట్టబద్ధత లేకపోవడంతో అసెంబ్లీలో ప్రవేశపెట్టి బదిలీల జీవోలకు ప్రభుత్వం చట్టబద్ధతను కల్పించింది. ఆ తర్వాత 2023 ఆగస్టులో బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను ప్రారంభించారు.

సైఫాబాద్‌లోని డీఎస్ఈ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న భాషా పండితులు

భాషా పండితుల 'చలో డీఎస్ఈ'

- సైఫాబాద్ డీఎస్ఈ వద్ద ధర్నా
- పదోన్నతులు నిలిపివేయడంపై మండిపాటు

హైదరాబాద్, జూన్ 22 (నమస్తే తెలంగాణ): భాషాపండితుల పదోన్నతుల్లో ప్రమోషన్లు లభించని టీచర్లు శనివారం చలో డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్(డీఎస్ఈ) నిర్వహించి, సైఫాబాద్‌లోని డీఎస్ఈ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రతి జిల్లాలో అప్‌గ్రేడ్ అయిన పోస్టులన్నీ చూపకుండా వెబ్ ఆప్షన్స్ సమయంలో రోస్టర్ అంటూ ఖాళీలు తగ్గించి పదోన్నతులను అడ్డుకోవడం అన్యాయమని వాపోయారు. ఆర్‌యూపీటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుమలకాంతికృష్ణ టీచర్లకు సంఘీభావం తెలిపారు. మల్టీజోన్ -1లో పదోన్నతుల తర్వాత 19 జిల్లాల్లో సగటున 20 -25 మంది భాషా పండితులు పదోన్నతి పొందలేకపోయారని ఎస్ఎల్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గౌరీశంకర్‌రావు ఆవేదన వ్యక్తంచేశారు. సీఎం చొరవ తీసుకుని, పదోన్నతులు కల్పించేలా ఆదేశాలివ్వాలని విజ్ఞప్తిచేశారు.

ఉపాధ్యాయ సంఘాల పదవులకు ఎస్జీటీల గుడ్‌బై

మంచిర్యాల జిల్లా కాసిపేటలో మూకుమ్మడి రాజీనామా

కాసిపేటలో వివిధ ఉపాధ్యాయ సంఘాల పదవులకు రాజీనామా చేస్తున్నట్టు ప్రకటిస్తున్న ఎస్జీటీ ఉపాధ్యాయులు

కాసిపేట, జూన్ 22 : మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలోని ఎస్జీటీలు తమ ఉపాధ్యాయ సంఘాల పదవులు, ప్రాథమిక సభ్యత్వానికి శనివారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. మండల కేంద్రంలో సమావేశమైన వారు.. పదోన్నతుల్లో జరుగుతున్న తీవ్ర అన్యాయానికి, వివిధ సంఘాలు ఎస్జీటీలను ద్వితీయశ్రేణి ఉపాధ్యాయులుగా భావిస్తూ, వారు చూపుతున్న వివక్షను ఖండిస్తూ వివిధ సంఘాల్లో ఉన్న పదవులు, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ప్రతి అంశంలో తీవ్రంగా వివక్షకు, అణచివేతకు గురవుతున్నందున పీఆర్టీయూ, టీఎస్‌యూటీఎఫ్, టీపీయూఎస్, టీయూటీఎఫ్, డీటీఎఫ్, టీజీయూఎస్ తదితర సంఘాలకు రాజీనామా చేసి ఎస్జీటీల న్యాయమైన హక్కుల కోసం సమష్టిగా కృషి చేస్తామని ఎస్జీటీ జేఏసీ నాయకులు పేర్కొన్నారు. ఎస్ఏ తెలుగు, హిందీ, పీడీ పదోన్నతుల్లో కామన్ సీనియారిటీని పాటించాలని, 10 వేల పీఎస్‌హెచ్‌ఎం పోస్టులు మంజూరు చేసి పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. ఎఫ్ఎల్ఎన్ రద్దు చేయాలని, ఎస్జీటీలకు ఎమ్మెల్సీ ఓటు హక్కు కల్పించాలని, పీఆర్సీలో ఎస్ఏలకు ఎస్జీటీల మధ్య భారీ వ్యత్యాసాన్ని తగ్గించాలని, జీవో 317 ద్వారా స్థానికత కోల్పోయిన ఎస్జీటీలకు న్యాయం చేయాలని, 12 ఏండ్ల సర్వీసు పూర్తి చేసిన ఎస్జీటీలకు ఎస్ఏ హోదా కల్పించాలని, కోరారు. 24 ఏళ్ల సర్వీసు పూర్తి చేసిన ఎస్జీటీలకు జీహెచ్‌ఎం హోదా ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్జీటీ జేఏసీ నాయకులు వేల్పుల కిరణ్‌కుమార్, జంగపల్లి సురేశ్, శారద, రాధిక, అర్పిత, ప్రకాశ్, సతీశ్, రాజయ్య, సుచరిత, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బుర్రా వెంకటేశంకు వినతిపత్రం అందజేసిన టీజీపీఏ నేతలు

గ్రేడ్-1 ప్రమోషన్లు కల్పించండి: టీజీపీఏ

హైదరాబాద్, జూన్22 (నమస్తే తెలంగాణ): గురుకుల పాఠశాల, కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్న గ్రేడ్-2 ప్రిన్సిపాళ్లకు గ్రేడ్-1 ప్రమోషన్లు కల్పించాలని టీజీపీఏ విజ్ఞప్తి చేసింది. ప్రిన్సిపాల్ సెక్రటరీ బు ర్రా వెంకటేశంను టీజీపీఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రౌతు అజయ్‌కుమార్ శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. మైనార్టీ, బీసీ వెల్ఫేర్ గురుకుల సొసైటీలో ప్రమోషన్లు ఇచ్చినట్టుగా తమకు కూడా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ పైళ్ల ప్రకాశ్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సురభి చైతన్య, జితేందర్, డాక్టర్ రమణమ్మ, రాధ తదితరులు పాల్గొన్నారు.

'నీట్'ను వెంటనే రద్దు చేయాలి

- పలు జిల్లాల్లో విద్యార్థుల రాస్తారోకో, ర్యాలీలు
- పాల్గొన్న విద్యార్థి సంఘాలు

వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

న్యూస్‌నెట్‌వర్క్, జూన్ 22 (నమస్తేతెలంగాణ): నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారంపై తెలంగాణ విద్యార్థిలోకం మండిపడింది. పరీక్షను వెంటనే రద్దు చేసి మళ్లీ నిర్వహించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు బీఆర్ఎస్వీ, ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శనివారం రాష్ట్ర వ్యాప్తంగా రాస్తారోకోలు నిర్వహించింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నర్సంపేట నియోజకవర్గంలో బీఆర్ఎస్వీ నాయకుడు సదిరం వినయ్‌భాస్కర్, పట్టణ అధ్యక్షుడు దేవోజు హేమంత్ ఆధ్వర్యంలో పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ నీట్ అవకతవకలపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. గవర్నర్ చొరవ తీసుకుని ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. నీట్ పేపర్ లీకేజీ ఘటనపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీ నరసింహారావు ఆధ్వర్యంలో హనుమకొండలోని జూనియర్ కాలేజీ వద్ద ప్లకార్డులతో నిరసన చేపట్టారు. సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జిచే విచారణ చేపట్టాలని, దోషులను కఠినంగా శిక్షించాలని, వెంటనే కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ని వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సాదిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో న్యాయవాది సాదిక్ అలీ విద్యార్థులు, సంఘాలతో కలిసి జనగామ ఆర్డీసీ చౌరస్తాలో ఒకరోజు నిరాహార దీక్ష చేపట్టారు. పేపర్ లీకేజీ బాధ్యులపై కేంద్రం వెంటనే చర్యలు తీసుకోకుంటే కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఉద్యమిస్తారని సాదిక్ అలీ హెచ్చరించారు. నీట్ పరీక్షను రద్దు చేయాలని పలు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిజామాబాద్ బీజేపీ ఎంపీ అర్వింద్ ఇంటిని ముట్టడించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. న్యూఎన్జీవోస్ కాలనీలోని ఎంపీ ఇంట్లోకి వెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు. మహబూబ్‌నగర్‌లో జిల్లా కేంద్రంలో పలు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు.

దశలవారీగా సింగరేణి బడుల్లో సీబీఎస్ఈ

- ప్రస్తుతం రామగుండం -2 ఏరియాలోని సెక్టర్ -3 స్కూల్లో ప్రారంభం

హైదరాబాద్, జూన్ 22 (నమస్తే తెలంగాణ): సింగరేణి సంస్థ నడుపుతున్న స్కూళ్లను దశలవారీగా సీబీఎస్ఈ స్కూళ్లుగా మార్చనున్నారు. ప్రస్తుతం రామగుండం -2 ఏరియాలోని సెక్టర్ -3 స్కూల్లో సీబీఎస్ఈ బోధనను ప్రవేశపెట్టనున్నట్టు సంస్థ సీఎండీ ఎన్ బలరాం శనివారం తెలిపారు. సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో 9 స్కూళ్లు, జూనియర్, డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్ కాలేజీలున్నాయి. వీటి పనితీరుపై శనివారం సీఎండీ బలరాం హైదరాబాద్‌లోని సింగరేణిభవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌ద్వారా సమీక్షించారు. విద్యాసంస్థలు 100శాతం ఫలితాలు సాధించాలని సీఎండీ ఆకాంక్షించారు. ఖర్చుకు వెనుకాడకుండా పాఠశాలల ఆధునీకీకరణకు చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. వీడియోకాన్ఫరెన్స్‌లో సంస్థ డైరెక్టర్ ఎస్‌వీకే శ్రీనివాస్, జీఎంలు దేవేందర్, నికోలస్ పాల్గొన్నారు.

గురుకుల అభ్యర్థుల్లో టెన్షన్

ఇటు సర్టిఫికెట్ వెరిఫికేషన్..అటు రాత పరీక్షలు

రీలింక్విష్మెంట్‌పై స్పందించని ప్రభుత్వం

ఆందోళనకు దిగుతామని అభ్యర్థుల హెచ్చరిక

హైదరాబాద్, జూన్ 22 (నమస్తే తెలంగాణ): గురుకుల ఉపాధ్యాయ నియామక పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి అపాయింట్‌మెంట్ లెటర్లు అందుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు ఎస్సీ, బీసీ గురుకుల సొసైటీలు షెడ్యూల్‌ను ప్రకటించాయి. సొసైటీలు ప్రకటించిన షెడ్యూల్ తేదీల్లో గ్రేడ్1, గ్రేడ్2 హాస్టల్ వెల్ఫేర్ పోస్టులకు రాతపరీక్షలు ఉండడంతో సొసైటీలకు ఎంపికైన అభ్యర్థులు ఆందోళనకు గురవుతున్నారు. మరోవైపు రీలింక్విష్మెంట్ విధానంపై స్పష్టత రాకముందే పోస్టింగ్స్ చేపడుతుండడంతో 1: 2జాబితాలో ఉన్న గురుకుల అభ్యర్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. కోర్టులో వివాదాలు కొనసాగుతున్నా రిక్రూట్‌మెంట్‌ను కొనసాగించడంపై అభ్యర్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

30వరకు సర్టిఫికేషన్ వెరిఫికేషన్

తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ట్రిబ్) నిర్వహించిన గురుకుల ఉపాధ్యాయ నియామక పరీక్షల్లో ఎంపికై, ఎంజేపీ బీసీ విద్యాసంస్థల సొసైటీకి అలాటయిన అభ్యర్థులకు 24వ తేదీ నుంచి సర్టిఫికేషన్ వెరిఫికేషన్‌ను నిర్వహించనున్నారు. ఈ మేరకు మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు షెడ్యూల్‌ను ప్రకటించారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్ 10లో సంత్ సేవాలాల్ బంజారా భవన్‌లో వారం రోజుల పాటు 30వ తేదీ వరకు ఉదయం 10 గంటల నుంచి ధ్రువపత్రాల పరిశీలన కొనసాగనుంది. 24న లైబ్రేరియన్ (స్కూల్, జూనియర్ కాలేజీ, డిగ్రీ కాలేజీ), ఫిజికల్ డైరెక్టర్, (జూనియర్ కాలేజీ, డిగ్రీ కాలేజీ), డిగ్రీ లెక్చరర్స్, 25న జేఎల్ (ఇంగ్లీష్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, సివిక్స్, ఎకనామిక్స్, కామర్స్, హిస్టరీ), 26న జేఎల్ (హిందీ, తెలుగు, గణితం), పీజీటీ (తెలుగు, హిందీ), 27న పీజీటీ (ఇంగ్లీష్, మ్యాథ్స్, ఫిజిక్స్, బయాలజీ, సోషల్) ఫిజికల్ డైరెక్టర్ గ్రేడ్-2, 28న టీజీటీ (హిందీ, బయోలాజికల్ సైన్స్, సోషల్), 29న టీజీటీ (ఇంగ్లీష్, ఫిజికల్ సైన్స్), 30న టీజీటీ (తెలుగు, గణితం) అభ్యర్థులు హాజరు కావాలని స్పష్టం చేశారు. అభ్యర్థులందరికీ ఇప్పటికే ఫోన్ నెంబర్లకు మెసేజ్‌లు పంపారు. అదేవిధంగా ఎస్సీ గురుకుల సొసైటీ సెక్రటరీ సీతాలక్ష్మి కూడా నూతనంగా నియామకమైన అభ్యర్థులకు పోస్టింగ్స్ ప్రక్రియకు సంబంధించిన షెడ్యూల్‌ను వెల్లడించారు. 24వ తేదీ నుంచి జూలై4 తేదీవరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించి, జూలై7వ తేదీలో గా పోస్టింగ్స్ ప్రక్రియను పూర్తిచేస్తామని స్పష్టం చేశారు.

అదే రోజున హాస్టల్ వెల్ఫేర్ రాతపరీక్షలు

ఎంజేపీబీసీ, ఎస్సీ గురుకుల సొసైటీలు ప్రకటించిన సర్టిఫికెట్ వెరిఫికేషన్ తేదీల్లోనే టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో గ్రేడ్1, గ్రేడ్ 2 హాస్టల్ వెల్ఫేర్, వార్డెన్ తదితర మొత్తంగా 581 పోస్టులకు రాత పరీక్ష కొనసాగనుంది. అందుకు సంబంధించిన షెడ్యూల్‌ను కూడా టీజీపీఎస్సీ ఇప్పటికే ప్రకటించింది. 24వ తేదీ నుంచి 29వ తేదీ వరకు ఉదయం10గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు విడతలుగా కంప్యూటర్ బేస్డ్ రిటర్న్ టెస్ట్‌ను నిర్వహించనుంది. సరిగ్గా అవే తేదీల్లో ఎంజేపీ సొసైటీ సైతం సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను నిర్వహించాలని నిర్ణయించింది. దీంతో పలువురు గురుకుల అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆందోళనలో అభ్యర్థులు

ట్రిబ్ ఆయా పోస్టులకు సంబంధించి ఫలితాలను విడుదల చేసింది మొదలు గురుకుల అభ్యర్థులు రీలింక్విష్మెంట్‌ను అమలు చేయాలని కోరుతున్నారు. డిసెండింగ్ ఆర్డర్‌ను కూడా పాటించకపోవడంతో భారీగా పోస్టులు బ్యాక్‌లాగ్‌లో పడిపోయే అవకాశముందని, అలాకాకుండా ఖాళీగా ఉండే పోస్టులను 1:2 జాబితాలోని తదుపరి మెరిట్ అభ్యర్థులతో భర్తీ చేయాలని కోరుతున్నారు. ఇదే అంశంపై కోర్టును ఆశ్రయించారు. పీడీ, లైబ్రేరియన్ తదితర పోస్టులకు, రూల్ ఆఫ్ రిజర్వేషన్‌తో పాటు అనేక అంశాలపై మొత్తంగా 18కేసులు కోర్టుల్లో ఉన్నాయి. వాటిపై ఇప్పటికీ విచారణ కొనసాగుతున్నది. అయితే ట్రిబ్ మాత్రం వెయిటింగ్ జాబితా లేదని, సొసైటీలకు వచ్చిన జాబితా ప్రకారం పోస్టింగ్స్‌ను ఇస్తామని స్పష్టం చేస్తున్నాయి. ట్రిబ్ నిర్లక్ష్యం, ప్రభుత్వ పట్టింపులేని తనంపై రాష్ట్రవ్యాప్తంగా మరోసారి ఆందోళనలకు సిద్ధమవుతామని హెచ్చరిస్తున్నారు.

ఎస్సీ గురుకులాల్లో ప్రమోషన్ల ప్రక్రియ ప్రారంభం

ఎస్సీ గురుకుల సొసైటీలో ప్రమోషన్ల షెడ్యూల్‌ను సొసైటీ సెక్రటరీ సీతాలక్ష్మి శనివారం ప్రకటించారు. 317 జీవో ద్వారా డిస్స్ లొకేషన్‌కు గురైన 1013 మంది ఉద్యోగులకు నూతన జోన్లలో పోస్టింగ్స్‌ను 26వ తేదీలోగా పూర్తి చేస్తామని వెల్లడించారు. సొసైటీలోని సీనియార్టి జాబితాను 24న ప్రకటించి, 27 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తామని తెలిపారు. జూలై1న సీనియార్టీ తుది జాబితాను ప్రకటించి, 4న ఫైనల్ చేస్తామని, 5న వెబ్ కౌన్సెలింగ్, 6న ప్రమోషన్ల ఆర్డర్లను ఇస్తామని ప్రకటించారు. 7న నూతనంగా సొసైటీలో నియామకైన అభ్యర్థులకు పోస్టింగ్స్‌ను ఇస్తామని వెల్లడించారు. ప్రమోషన్ల ప్రక్రియను ప్రారంభించడంపై సొసైటీ సెక్రటరీ సీతాలక్ష్మికి టిగారియా అధ్యక్షుడు మామిడి నారాయణ, జనరల్‌సెక్రటరీ డాక్టర్ మధుసూదన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ట్రిబ్ కార్యాలయంలో దివ్యాంగ అభ్యర్థులు ధర్నా

ట్రిబ్ నిర్వాకం వల్ల నాలుగు నెలలుగా తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నామని దివ్యాంగ అభ్యర్థులు డీఎస్ఎస్ భవన్ ఎదుట శనివారం నిరసన వ్యక్తం చేశారు. చైర్మన్ అందుబాటులో లేకపోవడంతో అధికారులతో వాగ్వాదానికి దిగారు. ట్రిబ్ ఇప్పటివరకుది వ్యాంగ క్యాటగిరీ అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించలేదు. ఆయా సొసైటీలు మాత్రం పోస్టింగ్స్ ఇచ్చే ప్రక్రియ ముమ్మరం చేస్తున్నాయి. వారికి ముందుగా పోస్టింగ్స్ ఇస్తే ఒకే రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ ద్వారా ఎంపికైనా సర్వీస్‌లో తాము జూనియర్లుగా పడిపోతామని దివ్యాంగ అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మెరిట్ జాబితాను వెంటనే ప్రకటించి, అందరితోపాటు పోస్టింగ్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ట్రిబ్ చైర్మన్‌ను కలిసేందుకు నాంపల్లిలోని అనిసుల్‌గుర్బాకు వెళ్లినా అందుబాటులో లేరని, కనీసం వినతి పత్రాన్ని అధికారులు తీసుకోలేదని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు. రిజల్ట్‌ను ప్రకటించి పోస్టింగ్స్ ఇవ్వాలని, లేదంటే ఆందోళనకు దిగుతామని అభ్యర్థులు హెచ్చరించారు.

కిషన్‌రెడ్డి ఇంటి ముట్టడికి యత్నం

- నీట్‌పై నోరు విప్పాలని విద్యార్థి నేతల డిమాండ్
- గనుల వేలంపాటపై ఉన్నతస్థాయి విద్యార్థులపై ఏదని నిలదీత

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నివాసం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

హైదరాబాద్, జూన్ 22 (నమస్తే తెలంగాణ): నీట్ పరీక్ష రాసిన 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు గురించి ఒక్కమాట మాట్లాడని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి పదవిలో కొనసాగే అర్హతలేదని విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యాచరణ సమితి పేర్కొన్నది. ఆయనకు గనుల వేలంపాటపై ఉన్నశ్రద్ధ విద్యార్థుల భవిష్యత్తుపై లేకపోవడం సిగ్గుచేటని విమర్శించింది. నీట్ అవకతవకలపై మాట్లాడటానికి అపాయింట్‌మెంట్ ఇవ్వాలని కేంద్రమంత్రిని విద్యార్థి సంఘాల నేతలు కోరగా ఆయన నిరాకరించారు. దీంతో శనివారం ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, ఎన్ఎస్‌యూఐ, పీవైసీ, డీవైఎఫ్ఐ, ఏఐవైఎఫ్, పీవైఎల్, వీజేఎస్, వైజేఎస్ సంఘాల నేతలు హైదరాబాద్‌లో కిషన్‌రెడ్డి నివాసప్రాంతానికి చేరుకోగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు, విద్యార్థి సంఘాల నేతల మధ్య తోపులాట చోటుచేసుకున్నది. ఈ తోపులాటలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్‌కు గాయాలయ్యాయి. 120 మంది నాయకులను అరెస్టు చేసిన పోలీసులు నల్లకుంట ఠాణాకు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

నీట్‌పై చాయ్ పే చర్చా చేపట్టండి

విద్యార్థి సంఘాల నేతలు మాట్లాడుతూ నీట్ పేపరు లీకేజీ అంశంపై ప్రధాని మోదీ చాయ్ పే చర్చా నిర్వహించాలని, ఇందుకు కిషన్‌రెడ్డి చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేపరు లీకేజీ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను బర్తరఫ్ చేయాలని కోరారు. పరీక్ష నిర్వహణలో విఫలమైన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేయాలని, నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలని సూచించారు. ముట్టడి కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు గ్యార క్రాంతి, నెల్లి సత్య, చైతన్య, వంశి, ఎస్ఎఫ్ఐ నాయకులు రజినీకాంత్, అశోక్‌రెడ్డి, లెనిన్, స్టాలిన్, పీడీఎస్‌యూ నాయకులు నాగేశ్వరరావు, సుమంత్, రుక్మత్ పాష, కోటి, వీజేఎస్ ప్రశాంత్, నరేందర్, దిలీప్, శేఖర్, ఎన్ఎస్‌యూఐ నాయకులు అభిజీత్ యాదవ్, విష్ణువర్ధన్, విధుర్, ఏఐవైఎఫ్ నాయకులు నెర్ల కంటి శ్రీకాంత్, శ్రీమన్, మాజిద్, కల్యాణ్, డీవైఎఫ్ఐ నాయకులు కోట రమేశ్, ఎండీ జావేద్, హమ్మీబాబు, క్రాంతి పాల్గొన్నారు.

జాబ్ క్యాలెండర్ ఏది?

- కాంగ్రెస్‌ను నిలదీసిన కిషన్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 22 (నమస్తే తెలంగాణ): అధికారంలోకి వచ్చిన వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు మరిచిపోయిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. ఆరు గ్యారంటీల అమలుకు గ్యారంటీనే లేకుండాపోయిందని ఎద్దేవా చేశారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ టీజీపీఎ